క్లుప్తంగా

వేగంగా సీఎం సభాస్థలం ఏర్పాట్లు



సీఎం హాజరుకానున్న సభాస్థలంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

దెందులూరు: దెందులూరులో ఈ నెల 25న జరిగే వైఎస్సార్ ఆసరా నగదు పంపిణీ బహిరంగ సభకు జరుగుతున్న ఏర్పాట్లను వైఎస్సార్‌సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గంటా ప్రసాదరావు, జడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం, అన్ని శాఖల మండలాధికారులు, గ్రామ కమిటీ అధ్యక్షులు పోకల రాంబాబు పరిశీలించారు. స్టేజ్, బారికేడ్లు, హెలిప్యాడ్, కార్ల పార్కింగ్, పారిశుద్ధ్య పనులు, హోర్డింగులు, జేసీబీలతో చదును చేసే కార్యక్రమాలను పరిశీలించారు. అన్ని శాఖల మండలాధికారులు, ఉద్యోగులు, అన్ని గ్రామాల పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో ఏర్పాట్లు పనుల్లో భాగస్వామ్యం కావాలని కామిరెడ్డి నాని కోరారు.

పెరుగ్గూడెంలో పాటెమ్మ తల్లి ఉత్సవాలు

దెందులూరు: చల్లచింతలపూడిలో పాటెమ్మ తల్లి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. బుధవారం ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ యలమర్తి శ్రీనివాసరావు, పెరుగ్గూడెం మాజీ సర్పంచ్ యలమర్తి హేమలత, చల్లచింతలపూడి గ్రామ సర్పంచ్ బైగాని వెంకటేశ్వరమ్మ శ్రీమన్నారాయణ, మాజీ సర్పంచ్ ఎం.మోహనరావు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, ఆలయ ప్రదక్షిణ, భజనలు నిర్వహించారు. గురువారం మహిళలతో కలశ పూజ, ఊరేగింపు నిర్వహిస్తామని చైర్మన్ శ్రీనివాసరావు అన్నారు.

కొవ్వలిలో అంకమ్మ తల్లి జాతర

దెందులూరు: కొవ్వలి గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో తులతూగాలని రజక సంఘం ఆధ్వర్యంలో కొవ్వలిలో అంకమ్మ తల్లి జాతర నిర్వహించారు. ముందుగా వీధుల్లో అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం జిల్లా, మండల, గ్రామ నాయకులు ముళ్లపూడి వెంకటేశ్వరరావు, గొవ్వాడ చంటి, గొవ్వాడ నాగరాజు, కోటి, రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

25నుంచి సౌత్‌జోన్ క్రికెట్ పోటీలు ప్రారంభం

దెందులూరు: వేగవరం హేలాపురి ఇంజనీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఈ నెల 25 నుంచి సౌత్ సెంట్రల్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు జరుగుతాయని కళాశాల ఏఓ టీఎస్ కరుణానిధి, ప్రిన్సిపల్ రాధాకృష్ణ అన్నారు. గోపన్నపాలెం వ్యాయామ కళాశాల, ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియం, కంచికచర్ల కళాశాల, హేలాపురి కళాశాలలో ఈ పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పోటీల నిర్వహణకుగానూ బుధవారం సాయంత్రం మ్యాచ్‌ల మధ్య పోటీల మధ్య టాస్‌లు వేశారు. గ్రౌండ్ ఏర్పాట్లను పరిశీలించారు.

వర్తకసంఘంలో శత వసంతాల స్థూపం

గణపవరం: శత వసంతాల చరిత్ర కలిగిన గణపవరం కన్యకాపరమేశ్వరి వర్తకసంఘ భవనంలో శత వసంతాల స్థూపం, వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసినట్లు వర్తకసంఘం అధ్యక్షుడు ఆర్‌వీఎస్‌రాజు తెలిపారు. ఉగాది సందర్భంగా బుధవారం స్థూపాన్ని, వినాయక విగ్రహాలను ఆర్‌వీఎస్‌రాజు దంపతులు ప్రారంభించారు. వంకాయల రామారావు, నడింపల్లి రాంపండు, ఉప్పల నాగేశ్వరరావు, మాదేటి సురేష్ పాల్గొన్నారు.

చెరువులను సంరక్షించుకోవాలి

గణపవరం: గ్రామాల్లో తరతరాలుగా వస్తున్న చెర్వులను సంరక్షించుకోవలసిన బాధ్యత గ్రామస్తులు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు పుప్పాల చినబాబు అన్నారు. బుధవారం గణపవరం మండలం చిలకంపాడులో రూ.15 లక్షల వ్యయంతో అభివృద్ధి చేసిన పశువుల చెర్వును ఆయన ప్రారంభించారు సర్పంచ్ చుక్కా అప్పారావు, ఎంపీటీసీ సభ్యుడు పెచ్చెట్టి వెంకట నారాయణ, తోట చిన్న కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

సైకిల్ స్టాండ్ వద్ద రోడ్డుకు హామీ

భీమడోలు: ఆగడాలలంక జెడ్పీ ఉన్నత పాఠశాలలో సైకిల్ స్టాండ్‌లో సైకిళ్లు ఉంచడానికి తగిన రోడ్డు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పాఠశాల పేరెంట్స్ కమిటీ, ఉపాధ్యాయులు భీమడోలు ఎంపీపీ కనమాల రామయ్యకు విన్నవించుకున్నారు. దీంతో ఎంపీపీ బుధవారం సైకిల్ స్టాండ్‌ను పరిశీలించారు. ఈ నేపథ్యంలో సైకిల్ స్టాండ్ వద్ద సిమెంట్ రోడ్డు నిర్మించేందుకు అవసరమైన నిధులను మండల పరిషత్ నుంచి మంజూరు చేస్తానని ఎంపీపీ కనమాల రామయ్య హామీ ఇచ్చారు. దీంతో పేరెంట్స్ కమిటి అధ్యక్షుడు ఘంటసాల అప్పయ్య, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

ఆసరాతో మహిళలకు ఆర్థిక భరోసా

దెందులూరు: మహిళలు ఆర్థిక ప్రగతికి జగనన్న ఆసరా పథకం దోహదపడుతుందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుధవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ మహిళా సాధికారిత సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి లక్ష్యమని తెలిపారు. మహిళాల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో 87లక్షలమంది మహిళలకు రూ.6,500కోట్ల నగదును నేరుగా బటన్ నొక్కి వారి బ్యాంకు ఖాతాలకు ముఖ్యమంత్రి జమ చేయడం దెందులూరు చరిత్రలో ఎప్పటికీ గుర్తుండిపోయే చారిత్రాత్మక అంశమన్నారు. దెందులూరు నియోజకవర్గంలో 53,350 మహిళలకు రూ.53 కోట్ల60 లక్షలు లబ్ధి చేకూరడం నియోజకవర్గ ఎమ్మెల్యేగా తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. దిశ, వైఎస్సార్ ఆసరా వంటి పథకాలతో పాటు అనేక పథకాలు పాదయాత్రలో చెప్పనివి కూడా అమలు చేస్తూ కోట్లాది రూపాయలు వెచ్చిస్తూ మహిళా పక్షపాతిగా సీఎం వైఎస్ జగన్ నిరూపించుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కనకదుర్గమ్మ తల్లి ఆలయ ట్రస్టు బోర్డు డైరెక్టర్ తొత్తడి వేదకుమారి, జడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం, ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత, మండల పార్టీ అధ్యక్షులు కామిరెడ్డి నాని, అప్పన ప్రసాద్, మెట్లపల్లి సూరిబాబు, తేరా ఆనంద్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు గంటా ప్రసాదరావు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పోకలరాంబాబు, ఎంపీటీసీలు తాళ్లూరి నాగరాజు, తోట విజయకుమారి, పులిపాటి ఆనంద్, జిల్లా కార్యదర్శులు కట్టా ఏసు బాబు, చల్లా మేరిరాజు, కొంగర రత్నకుమార్ అబ్బాస్, నాలుగు మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.



డ్వాక్రా మహిళలతో కలిసి దెందులూరులో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

అకాల వర్షంతో విద్యుత్ అంతరాయం

పెదపాడు: మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. గురువారం ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో పలు చోట్ల విద్యుత్ తీగలు తెగిపడటంతో సాయంత్రం 5గంటల నుంచి విద్యుత్ అంతరాయం ఏర్పడింది. విద్యుత్ అధికారులు మరమ్మతులు చేట్టారు. దీంతో చిరు వ్యాపారులు కొంతమేర ఇబ్బందులు పడ్డారు.

నేడు రాట్నాలమ్మ హుండీ లెక్కింపు

పెదవేగి : నేడు రాట్నాలమ్మ హుండీ లెక్కింపు కార్యక్రమం జరుగుతుందని దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎస్ సతీష్‌కుమార్ చెప్పారు. ఆయన బుధవారం దేవస్థానంలో మాట్లాడుతూ గురువారం ఉదయం 9గంటలకు ఆలయంలో అమ్మవారి హుండీ లెక్కింపు కార్యక్రమం ఉంటుందని, ఆసక్తిగల భక్తులు ఈ లెక్కింపులో పాల్గొనవచ్చని తెలియజేశారు.

స్వచ్ఛమైన తాగునీటికి అధిక ప్రాధాన్యత

గణపవరం: కొల్లేరు తీర ప్రాంతంలోని గ్రామాలకు స్వచ్ఛమైన త్రాగునీరు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, అందులో భాగంగా ప్రత్యేక వాటర్‌గ్రిడ్ పథకాన్ని రూ. 2 వేల కోట్లతో త్వరలోనే ప్రారంభించనుందని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. బుధవారం గణపవరంలో రూ.30 లక్షల వ్యయంతో అభివృద్ధి చేసిన సువర్ణగుండం మంచినీటి చెరువులో నీరు నింపే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. చెరువులో పసుపు,కుంకుమ పూజచేసి కొబ్బరికాయ కొట్టి నీటి మోటార్‌ను స్విచ్‌ఆన్ చేశారు. అంతకు ముందు పూర్తయిన మంచినీటి చెరువు తవ్వకం పనులు ఆయన పరిశీలించారు. గట్లు పటిష్టతపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. తవ్వకం పనుల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా జరిగిన సభలో వాసుబాబు మాట్లాడుతూ గణపవరం పట్టణంలో మరో రెండు దశాబ్దాల వరకూ మంచినీటి సమస్య లేకుండా ప్రధాన చెరువుల పూడిక తీత, గట్లు పటిష్టం చేసే పనులు పూర్తిచేశారన్నారు. ప్రధాన మంచినీటి చెరువు సువర్ణగుండం చెరువు పూడుకుపోయి, అడుసుదేరడంతో నీటి నిల్వసామర్థ్యం సగానికి సగం తగ్గిపోయిందని, చెరువులో ఊబి ఉండటంతో నీరుకూడా పాడయ్యేదన్నారు. ప్రస్తుతం చెరువును దాదాపు రూ.30 లక్షలతో పూడిక తీసి గట్లు పటిష్టం చేశారన్నారు. ప్రజలకు స్వచ్ఛమైన త్రాగు నీరు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, ఇందులో భాగంగా జల జీవన్ మిషన్ కార్యక్రమంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాలలో దాదాపు 30 కోట్ల రూపాయలతో మంచినీటి ట్యాంకులు, పైపులైన్ల అభివృద్ధి, మైక్రో ఫిల్టర్‌ల ఏర్పాటు పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. ఆక్వారంగం విస్తరించడంతో జిల్లాలో ముఖ్యంగా కొల్లేరు తీర గ్రామాలలో మంచినీటి కాలుష్యం తీవ్రంగా ఉందన్నారు. ఫిల్టర్‌బెడ్స్, మైక్రో ఫిల్టర్ ఏర్పాటుచేసినా పంట కాలువల ద్వారా చెరువులకు కలుషిత నీరు చేరడంతో పరిస్థితి మెరుగుపడటం లేదన్నారు. ఈస మస్యను ముఖ్యమంత్రి వైఎస్‌జగన్ దృష్టికి తామంతా తీసుకెళ్లగా గోదావరి నుంచి ప్రత్యేక పైప్‌లైన్లు నిర్మించి గ్రామాలకు నేరుగా మంచినీరు అందించే వాటర్ గ్రిడ్ పథకం ఏర్పాటుకు రూ.2 వేల కోట్లు మంజూరు చేశారని ఈ పథకం త్వరలోనే కార్యరూపం దాల్చనుందన్నారు. ఈ పథకం పూర్తయితే జిల్లాలో అన్నిగ్రామాల ప్రజలకు స్వచ్ఛమైన మంచినీరు లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆయన చెరువులో కుంకుమ పూజ నిర్వహించి, నీరు నింపేపనులు ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర సూర్యబలిజ కార్పొరేషన్ చైర్మన్ శెట్టి అనంతలక్ష్మి, సర్పంచ్ మూర అలంకారం, మండల ఉపాధ్యక్షురాలు సలాదిరత్నకుమారి, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ దండు రాము, జిల్ల ప్రధాన కార్యదర్శి నడింపల్లి సోమరాజు, ఏఎంసీ ఉపాధ్యక్షుడు గాదిరాజు అబ్బాస్, వైఎస్సార్ సీపీ నాయకులు కాకర్ల శ్రీను, రొంగల శ్రీను, తోట శ్రీను, జంపన శ్రీను, టాక్సీ రాజబాబు , మండల కోఆప్షన్ సభ్యుడు మహ్మద్‌జానీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరనాథ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



మంచినీటి చెరువులో నీరు నింపే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

ఘనంగా ఉగాది పర్వదినం

పెదవేగి: శుభకృత్ నామ తెలుగు సంవత్సరాది ఉగాది పండుగ సందర్భంగా స్థానిక రాట్నాలమ్మ అమ్మవారి ఆలయంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఆయా రాశుల్లో జన్మించిన వారి గ్రహస్థితులు, రాశిఫలాలను వివరించారు. శోభకృత్ నామ సంవత్సర ఉగాది పర్వదినం పురస్కరించుకుని మండలంలోని ప్రజలంతా సంతోషంగా సంబరాలు చేసుకున్నారు. ఉదయాన్నే షడ్రుచులతో కలిసిన ఉగాది పచ్చడిని సేవించారు. ఆలయాలకు వెళ్లి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, ఏపీ ఆయిల్ ఫెడ్ మాజీ రైతు కమిటీ చైర్మన్ కొఠారు. రామచంద్రరావు, రాణి దంపతులు అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ చల్లగొళ్ళ వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ గరికిముక్కు సర్వేశ్వరరావు, ఆలయ కార్యనిర్వహనాధికారి ఎస్ సతీష్‌కుమార్, పలువురు భక్తులు పంచాంగ శ్రవణంలో పాల్గొన్నారు. అనంతరం ఏప్రియల్ 6వ తేదీ నుంచి ప్రారంభం కానున్న తిరునాళ్ళకు సంబంధించిన కరపత్రాలను ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, కొఠారు రామచంద్రరావు దంపతులు ఆవిష్కరించారు. అనంతరం తిరునాళ్ళ పందిరి రాటాను పాతి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు పాకలపాటి వెంకటేశ్వరరావు, మేరుగు వెంకటేశ్వరరావు, నంబూరి జనార్ధన్‌రావు, నాగార్జున లక్ష్మీరాధిక, ఈడా ధర్మారావు, కట్టా నాగరాజు, లింగాల కనకారావు, విజయరాయి సొసైటీ చైర్‌పర్సన్ పాలడుగు సత్యనారాయణ, కొండలరావుపాలెం సర్పంచ్ పాలడుగు సత్యవతి, జెడ్పీ వైస్‌చైర్మన్ పెనుమాల విజయ్‌బాబు, రాట్నాలకుంట సర్పంచ్ జెట్టి వెంకటేశ్వరమ్మ, రాయన్నపాలెం సర్పంచ్ పర్వతనేని రమాదేవి, కొండలరావుపాలెం ఎంపీటీసీ దేవళ్ళరాజు రాధిక రాజశేఖర్, రాయన్నపాలెం ఎంపీటీసీ మట్టా రాగిణి,వరదయ్య, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, కొఠారు దంపతులు

భక్తిశ్రద్ధలతో ఉగాది వేడుకలు

భీమడోలు: శోభకృత్ నామ సంవత్సరాది వేడుకలు బుధవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని గుండుగొలను, పూళ్ల, భీమడోలు, కొల్లేరు గ్రామాల్లోని ఆలయాల్లో తెల్లవారుజాము నుంచి భక్తులు అధిక సంఖ్యలో స్వామి వార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గుండుగొలనులోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో జ్యోతిష్యుడు శ్రీ ప్రసాద శాస్త్రి, రామనుజం మంగపతిఆచార్యులు పంచాంగ శ్రవణం చేశారు. ఈఓ డి.శంకరరావు, ఆలయ ఉత్సవ కమిటి నిర్వాహకులు వగ్వాల మీనాకుమారి అచ్యుతరామారావు పాల్గొన్నారు. అనంతరం గ్రామోత్సవాన్ని నిర్వహించారు. పోలసానిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ షేక్ రహీమాబేగం హుసేనా, ప్రజాప్రతినిధులు ఉగాది సంబరాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అంబటి దేవి నాగేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి ఆలయంలో పూజలు

భీమడోలు: స్థానిక కాలువ గట్టుపై ఉన్న శ్రీ అయ్యప్ప స్వామి వారి ఆలయంలో తెలుగు సంవత్సరాది ఉగాది సందర్భంగా బుధవారం విశేష పూజా కార్యక్రమాలను వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయంలోని అయ్యప్ప మాలధారులు స్వామి వార్లకు విశేష అభిషేకాలు చేశారు. అర్చకులు బృందావనం మధుపవన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.

అభయాంజనేయస్వామి ప్రత్యేక పూజలు

పెదపాడు: మండలంలోని అప్పనవీడు గ్రామంలో వేంచేసియున్న అభయాంజనేయస్వామి ఆలయంలో ఉగాది పండుగను పురష్కరించుకుని భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ అర్చకులు ఆలయ ప్రాంగణంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. కొత్త సంవత్సరంలో నక్షత్ర, రాసుల సంచారంతో ప్రజలకు కలిగే మంచి కార్యక్రమాలపై వారికి అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో ఆలయ చైర్మన్ నెర్సు నాగభూషణం, పెదపాడు మండల కన్వీనర్ అప్పన ప్రసాద్, మాజీ జెడ్పీటీసీ సుంకర సుభాష్ చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆలయ సిబ్బందికి అర్చకులకు నూతన వస్త్రాలు పంపిణీ చేసారు. పెదపాడు మండలంలోని వివిధ గ్రామాల్లో అర్చకులు పంచాంగ శ్రవణం నిర్వహించారు.



గుండుగొలనులో పంచాంగ శ్రవణం చేస్తున్న జ్యోతిష్యుడు శ్రీప్రసాదశాస్త్రి

ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా

పెదవేగి : నియోజకవర్గంలో అన్ని ప్రాంతాల అభివృద్ధికై కృషి చేస్తున్నామని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. పెదవేగి మండలం విజయరాయి గ్రామంలో వెంకటేశ్వర స్వామి, వేణుగోపాల స్వామి వార్లను దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, రాష్ట్ర ఆయిల్ ఫెడ్ రైతు కమిటీ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు దంపతులు దర్శించుకున్నారు. ఆలయంలో రూ. 20 లక్షల రూపాయల నిధులతో చేపట్ట బోయే అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కొత్తగా ఎన్నికైన ఆలయ నూతన కమిటీ చైర్మన్ పీబీ వెంకటరమణిని, కమిటీ సభ్యులను ఎమ్మెల్యే అధ్యక్షతన ఆలయ కార్యనిర్వహణాధికారి ఎ రవిశంకర్ ప్రమాణస్వీకారం చేయించారు. ఎన్నికైన ప్రతి ఒక్కరిని ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి దుశ్శాలువాతో సత్కరించి, అభినందించారు. సొసైటీ అధ్యక్షుడు పాలడుగు సత్యనారాయణ, సర్పంచ్ గొట్టాపు కృష్ణవేణి, ఎంపీటీసీ1 కందద్దై వసంతలక్ష్మీ, ఇతర ఎంపీటీసీలు, నాయకులు పీబీ శ్రీనివాస్, పులగం వేణుగోపాల్‌రెడ్డి, ఆళ్ళ చంద్రశేఖర్‌రెడ్డి, రెడ్డెం శ్రీనివాసరెడ్డి, మంతెన కిషోర్, బొమ్మారెడ్డి రామచంద్రారెడ్డి, మన్నె బాబురావు, బైగాని రంగారావు, ఇతర నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఉగాది పండుగను పురస్కరించుకుని పెదవేగి మండలం రామసింగవరం గ్రామంలోని శ్రీ కొండాలమ్మ ఆలయాన్ని సందర్శించి, అమ్మవారిని దర్శించుకుని, ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నసమారాధన దెందులూరు శాసనసభ్యులు కొఠారు అబ్బయ్యచౌదరి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



వెంకటేశ్వర స్వామి, వేణుగోపాల స్వామి ఆలయ అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

ఉగాది పురస్కార గ్రహీత స్వరూప్‌కు సత్కారం



ఉగాది పురస్కార గ్రహీత, వైద్యుడు స్వరూప్ దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

భీమడోలు: గుండుగొలనులోని దివ్యాంగుల సేవా సమితి భవనంలో బుధవారం ఉగాది పురస్కారాల వేడుక ఘనంగా జరిగింది. ఈ సేవా సమితికి సేవలందిస్తున్న ప్రముఖులను సత్కరించారు. ఏలూరుకు చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ స్వరూప్ దంపతులను గ్రామ పెద్దలు, దాతలు, గ్రామస్తులు సన్మానించారు. ఈ సందర్భంగా దాతల సహకారంతో దివ్యాంగులకు పండ్లు, సీట్లును అందించారు. దాత దాట్ల సీతారామరాజు ఆర్థిక సహకారంతో 400 మందికి అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఉమ్మడి జిల్లా దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ నీలకంఠం మాట్లాడుతూ దివ్యాంగులు, వృద్ధులకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలి

నిడమర్రు: శ్రీశోభకృత్ నామ సంవత్సరంలో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ ఆధ్వర్యంలో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ఆకాంక్షించారు. ఉగాది సందర్భంగా బువ్వనపల్లిలోని సంకు సత్తియ్య, సీతామహాలక్ష్మి దంపతుల కల్యాణ వేదిక వద్ద కేశవరం సిద్ధాంతి దర్భముళ్ల చినవీరన్న శాస్త్రిచే పంచాంగ శ్రవణం నిర్వహించారు. అనంతరం పత్తేపురం శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయం వద్ద జరిగిన పంచాంగ శ్రవణంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.

వలంటీర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

భీమడోలు: మండలంలో ఖాళీగా ఉన్న ఆరు గ్రామ వలంటీర్ల పోస్టులకు అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు భీమడోలు ఎంపీడీఓ జీఎల్ఎస్‌వీ రాఘవన్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ పత్రికా ప్రకటనను విడుదల చేశారు. మండలంలోని 13 గ్రామ పంచాయతీ పరిధిలోని అంబర్‌పేట 2, భీమడోలు. గుండుగొలను, పూళ్ల, సూరప్పగూడెం గ్రామాల్లో ఒకొక్కటి చొప్పున పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అంబర్‌పేటలో బీసీఏ, బీసీబీ కేటగిరి మహిళలకు, భీమడోలులో ఎస్టీ జనరల్‌కు, గుండుగొలను బీసీడీ మహిళకు, పూళ్ల ఎస్సీ జనరల్‌కు, సూరప్పగూడెం బీసీ-ఏ మహిళలకు కేటాయించినట్లు పేర్కొన్నారు. పదో తరగతి పాసై ఉండాలని, 18 నుంచి 35 ఏళ్ల లోపు వారే ఉండాలన్నారు. ఈ నెల 26లోగా అర్హత ఉన్న వారంతా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 28న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

వ్యక్తికి గాయాలు

ఉంగుటూరు: గణపవరం–నారాయణపురం ఆర్‌అండ్‌బీ రహదారిలో బుధవారం నారాయణపురం శివారుల్లో స్కూటరుపై వెళుతు స్కిడ్‌అయి పడిపోవడంతో బూరెల సత్యనారాయణ(46) తీవ్ర గాయాల య్యాయి. ఇతనిని తొలుత తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి, పరిస్థితి విషమంగా ఉండటంతో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. పరిస్థితి విషమంగానే ఉన్నట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు.


పూళ్ల వద్ద చలివేంద్రం ప్రారంభం

భీమడోలు: జాతీయ రహదారి పూళ్ల వద్ద మాజీ సర్పంచ్ పుప్పాల మోహన సీతారామయ్య జ్ఞాపకార్థం ఆయన తనయుడు మాజీ డీసీసీబీ డైరెక్టర్ పుప్పాల శ్రీనివాస్ ఆర్థిక సాయంతో జై భవానమ్మ ఆటోయూనియన్ బుధవారం మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని పుప్పాల శ్రీనివాస్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఓగిరాల సాలేము, నల్లమిల్లి నాగరాజు పాల్గొన్నారు.

దేవాలయాల అభివృద్ధికి కృషి

నిడమర్రు: రాష్ట్రంలో దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. బుధవారం బువ్వనపల్లిలో జరిగిన కార్యక్రమంలో గ్రామంలోని వివిధ దేవాలయాల నూతన కమిటీల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామ దేవత పల్లాలమ్మ, నాగేంద్రస్వామి ఆలయాల కమిటీ చైర్మన్‌గా మాజీ సర్పంచ్ సంకు పుల్లారావు, శ్రీదేవీ భూదేవీ సమేత బాలవెంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా అలుమోలు ఏసుబాబు, శ్రీకోదండ రామాలయం కమిటీ చైర్మన్‌గా యిమ్మిడిశెట్టి కృష్ణమోహన్, శ్రీ ఉమామార్కెండేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా అలుమోలు అంతర్వేదిలు ప్రమాణస్వీకారం చేశారు. వెజ్జు వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యుడు కోడే కాశి, మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వాటికన్ రాయబారి గెరెల్లి రాక



వాటికన్ రాయబారి లియోపోర్డ్ గేరెల్లి

పెదవేగి : వాటికన్ రాయబారి లియోపోర్డ్ గేరెల్లి ఈనెల 23వ తేదీన సెయింట్ జోసెఫ్ దంత కళాశాలకు విచ్చేస్తున్నట్లు కళాశాల కరస్పాండెంట్, సెక్రటరీ ఫాదర్ జి మోజెస్ తెలిపారు. బుధవారం పెదవేగి మండలం దుగ్గిరాల గ్రామంలోని సెయింట్ జోసెఫ్ దంత కళాశాల్లో ఫాదర్ మోజెస్ మాట్లాడుతూ వాటికన్ రాయబారి అయిన గేరెల్లి ఇటలీ దేశంలో జన్మించారని, అపోస్తులిక్ నోన్ షో భారతదేశానికి , నేపాల్ దేశానికి మధ్య ఈయన ప్రతినిధిగా వ్యవహరిస్తారని మోజెస్ చెప్పారు. ఈనెల 23వ తేదీన మధ్యాహ్నం 2: 30 గంటలకు దంత కళాశాలకు వస్తున్నట్లు ఫాదర్ మోజెస్ వివరించారు.

చల్లాలమ్మ ఆలయం వద్ద ఉగాది సందడి

ఉంగుటూరు: గ్రామదేవత చల్లాలమ్మ ఉత్సవాలు బుధవారం ఉగాది పర్వదినం రోజున ప్రారంభమయ్యాయి. అమ్మవారిని మేళతాళాలతో చలవ బట్టలుమీద పోతురాజు గుడికి తీసుకెళ్లారు. అక్కడ రౌతు రామకృష్ణ దంపతులతో పూజలు అందుకున్న తరువాత అమ్మవారిని పుట్టిల్లుగా పిలవబడే తల్లాప్రగడ భీమేశ్వరరావు ఇంటికి తీసుకెళ్లారు. అనంతరం తల్లాప్రగడ వారి కుటుంభ సభ్యులు అమ్మవారికి పూజలు చేశారు. ఉత్సవ కమిటీ చైర్మన్ శ్రీరెడ్డి శ్రీనివాసరావు నేతృత్వంలో అమ్మవారిని ఊరేగించారు.

చల్లాలమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే వాసుబాబు

ఉంగుటూరు గ్రామ దేవతచల్లాలమ్మ ఉత్సవాలు ప్రారంభంలో భాగంగా అమ్మవారిని స్థానిక శాసనసభ్యులు పుప్పాల వాసుబాబు దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం అర్చకులు ఎమ్మెల్యే వాసుబాబుకు వేద ఆశీర్వచనం అందించారు. కార్యక్రమంలో నాయకులు పెనుగొండ బాలకృష్ణ, సందక రాంబాబు, దూసనపూడి లక్ష్మీనారాయణ, గంట శ్రీలక్ష్మి, మంద జయలక్ష్మి, బావన సూరిబాబు, రంగు వెకటేశ్వరరావు, గంట సుబ్బారావు,కొల్లి నాగేశ్వరరావు,మారిశెట్టి సత్యనారాయణ, దొంతంశెట్టి సత్యనారాయణ, కాళ్ల శివాజీ పాల్గొన్నారు.

కనులపండువగా గ్రామోత్సవం

దెందులూరు: తెలుగు సంవత్సరాది ఉగాదిని దెందులూరులో రామదండు ఆధ్వర్యంలో నిర్వహించారు. దెందులూరు గ్రామంలో ఉన్న విష్ణాలయంతో పాటుగా 9 ఆలయాల్లో శ్రీ శోభాకృత్ నామ సంవత్సర సందర్భంగా దేవదేవేరుల శోభాయాత్రకు రథాలను ప్రత్యేక అలంకరించారు అనంతరం స్వామి వారి సన్నిధిలో పంచాంగ శ్రవణం చేసి ప్రత్యేక పూజలు చేశారు. దెందులూరు లోని విష్ణు ఆలయంలో రామదండు గ్రామోత్సవ నిర్వహణ కమిటీ సభ్యులు మటపర్తి రాజా బాబు, సుగ్గిశెట్టి సూకరాజు తదితర రామ దండు సభ్యులు ప్రత్యేక పూజలు చేసి భారీ ఊరేగింపు నిర్వహించారు. రామదండు ఆధ్వర్యంలో 50 వేల మందికి అన్నదాన ప్రసాదం నిర్వహించారు.



చల్లాలమ్మ ఊరేగింపు ప్రారంభిస్తున్న దృశ్యం



ఉంగుటూరులో అమ్మవారిని దర్శించుకుని వేద ఆశీర్వచనం అందుకుంటున్న ఎమ్మెల్యే వాసుబాబు